క్లుప్తంగా

విద్యార్థులకు యోగాపై శిక్షణ


పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

పి.గన్నవరం: 'ఆడుదాం ఆంధ్ర' ప్రారంభోత్సవ సన్నాహ కార్యక్రమంలో భాగంగా శనివారం పి.గన్నవరంలోని శ్రీమతి శింగంశెట్టి ప్రభావతి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండల స్థాయిలో విద్యార్థులకు యోగాపై శిక్షణ తరగతులు నిర్వహించారు. యోగా ప్రాముఖ్యతను, తద్వారా కలిగే ప్రయోజనాలను యోగా టీచర్ సానబోయిన సాయిరామ్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.భారతి, పాఠశాల హెచ్ఎం డీఎస్వీ ప్రసాద్, ఆర్.రామకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వదంతులు నమ్మకండి

మలికిపురం: వైఎస్సార్ సీపీ అసెంబ్లీ నియోజక వర్గాల అభ్యర్థులు ఖరారు అంటూ కొన్ని పేర్లతో సోషల్ మీడియాలో జరుగుతున్న వస్తున్న వదంతులను నమ్మవద్దని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ చింతా రాజబాబు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పార్టీలో అలజడి సృష్టించాలని ప్రతి పక్షాలు, కొన్ని శక్తులు చేస్తున్న అసత్య ప్రచారం అని ఆయన అన్నారు. పార్టీ శ్రేణులు సంయమనం పాటించాలని ఆయన సూచించారు.

ఘనంగా అయోధ్య అక్షతల ఊరేగింపు


పాశర్లపూడిలో అక్షతల ఊరేగింపులో పాల్గొన్న రామ భక్తులు

మామిడికుదురు: రామ జన్మభూమి అయోధ్య నుంచి తీసుకువచ్చిన పూజాక్షతలను శనివారం పాశర్లపూడిలో ఘనంగా ఊరేగించారు. పాశర్లపూడి పెట్రోల్ బంక్ నుంచి పాశర్లపూడి బాడవ సత్యనారాయణస్వామి ఆలయం వరకు 216వ నంబర్ జాతీయ రహదారి పొడవునా ఊరేగించారు. కార్యక్రమంలో రామభక్తులు తోరం సూర్యభాస్కర్, పాటి గంగా సత్యనారాయణ, కొనుకు నాగరాజు, తుమ్మా పద్మాజి, చుట్టుగుళ్ల కిశోర్, మల్లాడి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రామమందిర సందర్శనకు ఆహ్వానించాలి

అంబాజీపేట: వచ్చే ఏడాది 22న అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా అక్షతల శోభయాత్రను నిర్వహించి అయోధ్య రామమందిర సందర్శనకు ఆహ్వానించాలని జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు భమిడిపాటి కృష్ణమూర్తి అన్నారు. పుల్లేటికుర్రులో విశ్వహిందూ పరిషత్ మండల ప్రచారక్ కడలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన వితరణ అక్షతలు గ్రామాల ప్రముఖులకు శనివారం అందించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల బీజేపీ ఎస్సీ మోర్చా జోనల్ ఇంచార్జి కొల్లి సూర్యారావు, కముజు శ్రీనివాసు, అప్పన గణపతిరావు తదతరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన


ఈవీఎం పనితీరుపై అవగాహన కల్పిస్తున్న వీఆర్వో గంగాధర్

రాజోలు: ఈవీఎంల పనితీరుపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు తెలిపారు. శనివారం పొదలాడ గ్రామ సచివాలయం వద్ద ఓటర్లకు ఈవీఎం, ఈవీఎం ప్యాడ్‌లపై వీఆర్వో ఎ.గంగాధర్ అవగాహన కలిగించారు. ఈవీఎంల ద్వారా ఓటు వేసినప్పుడు ఓటు ఎలా నమోదు అవుతుందో వివరించారు. వార్డు సభ్యుడు కొల్లాబత్తుల సతీష్‌బాబు, దుర్గాభవాని పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: జిల్లా కలెక్టర్, ఈఆర్వో ఆదేశాలపై శనివారం మండలంలోని రామేశ్వరం, ఉయ్యూరువారి మెరక, అప్పనరామునిలంక గ్రామాల్లో ఓటర్లకు ఈవీఎంలపైన, వీవీప్యాట్స్ మెషీన్లపైన అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు పై మూడు గ్రామాల్లో ఏఈఆర్వో, తహసీల్దార్ వై.రామకుమారి పర్యవేక్షణలో సెక్టోరల్ ఆఫీసర్లు జె.శ్రీనివాస్, పీవీ నరసింహారావు, కె.సూర్యనారాయణ, తహసీల్దార్ కార్యాలయం స్టాఫ్ టి.విష్ణుమూర్తి ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం


అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రహదారుల నిర్మాణానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, పార్టీ నాయకుడు వాసంశెట్టి పెదబాబు అన్నారు. వక్కలంక శివారు శ్రీరామ్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులతో ఈ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గుణశేఖర్, వై.జయబాబు, పి.మోహన్, పిల్లి రమేష్, ఎం.విష్ణుప్రసాద్, ఎస్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


అంబాజీపేటలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి


ఎల్.గన్నవరంలో ఉత్తరద్వార దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి


అంతర్వేదిలో కంచుగరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం


ప్రత్యేక అలంకరణలో ఆలమూరు జనార్దనస్వామి


నల్లచెరువులో గరుడ వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

- ఉత్తర ద్వారం గుండా భక్తుల దర్శనం
- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- వైభవంగా లక్ష చామంతి పూజ


అంతర్వేదిలో ఉత్తర ద్వారం వద్ద భక్తులకు దర్శనమిచ్చిన స్వామి, అమ్మవార్లు


అప్పనపల్లిలో గోదాదేవికి నిర్వహిస్తున్న లక్ష చామంతి పూజ

మామిడికుదురు: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. ఉత్తర ద్వారం వద్ద శ్రీ, భూ సమేత బాలబాలాజీ స్వామి భక్తులకు కనువిందుగా దర్శనమిచ్చారు. కలియుగ ప్రత్యక్ష దైవం బాల బాలాజీ స్వామిని దర్శించుకుని భక్తులు పరవశించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి వారి దర్శనం కోసం భారీగా తరలి వచ్చారు. స్వామి వారి సన్నిధిలో కొలువుదీరిన ఆండాళ్‌తాయార్ (గోదాదేవి)కి లక్ష తులసి పూజ నిర్వహించారు. గరుడ వాహనంపై స్వామి అమ్మవార్లను ఊరేగిస్తూ నిర్వహించిన గ్రామోత్సవం మేళ తాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ వైభవంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరీదేవి, మానేపల్లి అయ్యాజీ వేమా, ఎంపీపీ కుసుమ వనజకుమారితో పాటు పలువురు ప్రముఖులు బాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పి.గన్నవరం: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని మండలంలో భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్.గన్నవరంలోని బీబీ నాంచారీ, అలివేలు మంగా సహిత వేంకటేశ్వరస్వామి వారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామికి పూజలు చేశారు. అర్చకస్వామి ఖండవిల్లి నారాయణాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. పి.గన్నవరం శివారు పోతవరంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారు భక్తులకు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

అంబాజీపేట: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యుల ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామికి చామంతి పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో తెల్లవారుజామున ఉత్తర ద్వార భక్తులకు ప్రవేశం కల్పించారు. ముక్కామలలో రాఘవేంద్ర స్వామికి లక్ష చామంతి పూజలు నిర్వహించారు. ఇసుకపూడి జక్కంశెట్టివారి పాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామికి సామూహిక లక్షతులసి పూజ నిర్వహించారు.

రావులపాలెం: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం మండలంలోని వివిధ ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయాన్నే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరిగింపులో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణలు, బాణ సంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సఖినేటిపల్లి: కోటి ఏకాదశి తిథులతో ముక్కోటి ఏకాదశి సమానమని పురాణ ప్రతీతి. శనివారం ఏకాదశి పర్వదినం సందర్భంగా అంతర్వేది పుణ్య క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయ ప్రధాన ప్రాకారానికి ఉత్తరం వైపు నున్న రాజగోపురాన్ని పూలతో తీర్చిదిద్దారు. అలాగే ఆలయంలో ప్రాకార మండపానికి అదే మార్గంలో ఉన్న మరో ద్వారానికి తాత్కాలిక వైకుంఠ ద్వారాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యాన అర్చకులు ఏర్పాటు చేశారు. ఏకాదశి ఘడియల్లో ఉత్తర ద్వారం వద్ద ప్రత్యేక ఆసనంపై ఆశీనులు చేసిన స్వామి, అమ్మవార్లకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలు, తులసి మాలలతో స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ ఉత్తర ద్వారం ద్వారా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు దంపతులు, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, నెడ్ క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, ఎంపీటీసీ బైర నాగరాజు, భక్తులు వెళ్లి ద్వారం వద్ద కొలువుదీరిన శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అక్కడ నుంచి వెళ్లి స్వామివారి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. కాగా ప్రతి నిత్యం నిర్వహించే నారసింహ సుదర్శన హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామిని ఉత్తర ద్వారం ద్వారా 10 వేల మంది భక్తులు దర్శించుకున్నట్టు ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. అలాగే ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా అంతర్వేది దేవస్థానం, అంతర్వేదికర, మోరి, వీవీమెరక, కేశవదాసుపాలెం, టేకిశెట్టిపాలెం, అంతర్వేది రోడ్డు సెంటర్, సఖినేటిపల్లిలంక గ్రామాల్లోని శ్రీఆంజనేయ స్వామివారి ఆలయాల్లో భక్తులు ఏకాహం కార్యక్రమాలను నిర్వహించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు జరుపుకొన్నారు. వైష్ణవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడటంతో క్యూలు కిక్కిరిసిపోయాయి. వేకువజామునే పుణ్యస్నానమాచరించిన ఆలయాలకు చేరుకుని వైష్ణవాలయాల్లోని దేవతామూర్తులను ఉత్తర ముఖం ద్వారా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు చేపట్టిన విద్యుద్దీపాలంకరణ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలమూరు, జొన్నాడ గ్రామాల్లో వేంచేసిన జనార్దనస్వామి ఆలయాలు, చింతలూరు, గుమ్మిలేరు, సర్పిపూడి, సంధిపూడి, జొన్నాడ గ్రామాల్లో నెలకొల్పిన వేంకటేశ్వర ఆలయాల్లో అన్నసమారాధనలు జరిగాయి. ఆయా ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజనలు భక్తులను అలరించాయి.

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు శనివారం కనుల వైకుంఠంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త గణేశుల వెంకటేశ్వరరావు, పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు వైభవంగా పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి ఇచ్చారు. స్వామి ఉత్తరద్వార దర్శనం ఇచ్చారు. శ్రీహరే శ్రీనివాస బృందం వారి కోలాటం ఏర్పాటు చేశారు. స్వామిని గరుడ వాహనంపై ఊరేగించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. అయినవిల్లి సీతారామచంద్రమూర్తి, శ్రీ, భూ సమేత కేశవస్వామి, అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పలు గ్రామాల్లో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రాజోలు: ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని రాజోలులోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామి వారి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు, ధర్మకర్తల మండలి చైర్మన్ మొల్లేటి నాగరాజు, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీఈశ్వరి, న్యాయవాది ఉపాధ్యాయుల ఉమామహేశ్వరరావు తదితరులు స్వామి వారిని దర్శించుకుని కల్యాణ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం


బట్టేలంకలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక విద్యావ్యవస్థలో సమూల మార్పులను తీసుకువచ్చారని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురం మండలంలోని బట్టేలంక హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను ఎమ్మెల్యే శనివారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యతోనే పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం పేదలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుందని నమ్మిన సీఎం జగన్ ఆ దిశగా అడుగులు ముందుకు వేశారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, రుద్రరాజు చిన్నరాజా, నల్లి శివ కుమార్, గుబ్బల రమేష్, చింతా రాజబాబు, ఎంపీటీసీలు కందికట్ల లలిత, నల్లి అంజలీదేవి, చెల్లింగి ఈశ్వరి, సర్పంచ్ రేవు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వివిధ విభాగాల తనిఖీ

పి.గన్నవరం: స్థానిక సీహెచ్‌సీని కాయకల్ప అవార్డుకు ఎంపిక చేసే విషయమై ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పాలకొల్లు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభాకరరావు శనివారం ప్రాథమిక పరిశీలన చేశారు. ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పారిశుధ్యం తదితర అంశాలను పరిశీలించారు. ఆస్పత్రిలో ఓపీ, ఆపరేషన్ థియేటర్, ఇన్ పేషెంట్ గదులు, బెడ్లు, ఇతర విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ అప్పారి సూర్యనారాయణ, అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు, వైద్యులు రాఘవేంద్రరావు, శిల్ప, కె.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

యోగా సభ్యుల రక్తదానం

కొత్తపేట: ప్రమాదాల్లో గాయపడిన, వివిధ ఆరోగ్య కారణాలతో రక్తం అవసరమైన వారి కోసం స్థానిక స్వామి వివేకానంద యోగా ఆశ్రమం సభ్యులు శనివారం రక్తదానం చేసినట్టు యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. యోగా సెంటర్ సభ్యులు 28 మంది అమలాపురం ఏరియా హాస్పిటల్‌కి రక్తదానం చేశారని తెలిపారు. రక్తదానం చేసి ప్రశాంత్, దుర్గా, అనిల్, సుధీర్, దుర్గారావు, మల్లేష్, పి.కార్తిక్, చంటి, వెంకన్న, కుమారస్వామి, సాయి, ప్రభాకర్, సునీల్ ఆయన అభినందిచారు.

ప్రభుత్వ ఆస్తి ధ్వంసం చేసేవారిపై చర్యలు తీసుకోవాలి

అంబాజీపేట: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు అసంఘటిత కార్యకలాపాలకు పాల్పడి ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పుల్లేటికుర్రు పంచాయతీ కార్యదర్శి వి.వెంకటరమణ అన్నారు. దీనిపై అంబాజీపేట పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 22న ఉన్నతాధికారులు తనిఖీ నిమిత్తం వస్తున్నారని సంపద కేంద్రానికి వెళ్లి చూడగా అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించి మద్యం సీసాలు పగుల గొట్టడమే కాకుండా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. రూ.28,500 విలువ చేసే తయారైన సంపదను కొబ్బరి ఆకులతో అంటించి పాడుచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిని గుర్తించి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతి పత్రం అందజేసినట్లు వెంకటరమణ తెలిపారు.

సీఎం జగన్ పాలన సువర్ణాధ్యాయం

- ఎమ్మెల్యే రాపాక
- రాజోలులో గడపగడపకూ..


లక్కవరంలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణాధ్యాయమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. మండలంలోని లక్కవరంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీంతో నియోజకవర్గంలో మొత్తం అన్ని గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయింది. ఎమ్మెల్యే రాపాక పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులను కూడా స్వీకరించారు. వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. అనంతరం జరిగిన ముగింపు సభలో ఆయన పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రధానంగా సంక్షేమ పథకాల అమలులో అవినీతి రూపుమారిందని ఆయన అన్నారు. నేరుగా ప్రజల వద్దకే పాలన, ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. తద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీని వల్ల ప్రతిపక్షాల గొంతులో వెలక్కాయపడినట్లు ఉందన్నారు. ఫలితంగా వైఎస్సార్ సీపీపై తప్పుడు ఆరోపణలకు ప్రతిపక్షాలు తెరలేపాయని ఎమ్మెల్యే అన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదనలు స్వీకరించిందని త్వరలోనే నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, పార్టీ సీనియర్ నాయకులు కేఎస్ఎన్ రాజు, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చిన్న రాజా, మాజీ ఎంపీపీ ముత్యాల కాశి, మంగెన సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభను వెలికితీయాలి


ఆలమూరులో 'ఆడుదాం ఆంధ్ర'పై సమీక్ష నిర్వహిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఆలమూరు: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి ప్రపంచానికి చాటి చెప్పాలని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సమీక్ష జరిగింది. ఎంపీపీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈనెల 26న ప్రారంభమయ్యే ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి గ్రామ సచివాలయం నుంచి కనీసం పది జట్లు పాల్గొనే విధంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో ఐదు రోజులు, మండల స్థాయిలో వారం రోజుల పాటు నిర్వహించిన అనంతరం అందులో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన విజేతలకు నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈపోటీలను విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈఓపీఆర్డీ రాజ్‌కుమార్, పీఈటీలు ఎస్.గంగవేణి, సత్తిబాబు, కార్యదర్శులు కె.సంజీవ్‌రెడ్డి, సీహెచ్ వీరమాత, యు.రేణుక, ఆర్‌వీవీ సత్యనారాయణ, సుప్రియ, ఎస్.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి


రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రామానుజన్ జయంతి పురస్కరించుకుని విద్యార్థులకు కళాశాల మ్యాథమెటిక్స్ లెక్చరర్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి కృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రామానుజన్ ప్రపంచంలోనే గుర్తింపు కలిగిన భారతదేశ లెక్కల మేధావి అని, మ్యాథమెటిక్స్‌లో ప్రపంచంలోనే ఎన్నో రకాలుగా మ్యాజిక్స్‌ని చేసి నిరూపించిన మంచి జ్ఞాని అని కొనియాడారు. విద్యార్థులందరూ పోటీ పరీక్షల్లో నెగ్గి ఉద్యోగాలు సాధించాలంటే తప్పనిసరిగా మ్యాథమెటిక్స్‌పై పట్టు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్, కళాశాల అధ్యాపకులు బీపీయన్ రెడ్డి, ప్రసాద్, యువరాజ్, నాగలక్ష్మి, పూజ, హేమలత, సౌజన్య, శైలజ, దుర్గాదేవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ వేషధారణలో అలరించిన విద్యార్థినులు


మామిడికుదురులో క్రిస్మస్ వేడుకలో సందడి చేసిన విద్యార్థులు

రావులపాలెం: మండలంలోని వివిధ చర్చిల్లో శనివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిద్ధార్థ స్కూల్లో నిర్వహించిన వేడుకలను విద్యార్థులు క్రిస్మస్ దుస్తులు ధరించి అలరించారు. శాంతాక్లాజ్, క్రిస్మస్ ట్రీ తదితర అలంకరణలతో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. విద్యార్థుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మామిడికుదురు: గ్రామంలో ముందస్తు క్రిస్మస్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. శాంతాక్లాజ్ వేషధారణతో విద్యార్థులు సందడి చేశారు. ఏసుక్రీస్తు గీతాలు ఆలపిస్తూ అలరించారు. దీప్తి స్కూల్‌లో జరిగిన ఈ వేడుకలో కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ కేక్ కోసి విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొత్తపేట: ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగ వివిధ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య జీవితాన్ని గడపాలని ఎంపీపీ మార్గం గంగాధరరావు సూచించారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీపీ కార్యాలయం ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో ఈ.మహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తుందని దానిలో భాగంగా నాడు నేడు పథకం కింద పాఠశాల ఆధునికరణ మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. పాఠశాల కళాశాల విద్యార్థులతో పాటు గ్రామీణ యువతను క్రీడారంగంలో తీర్చిదిద్దేందుకు ఆడుదాం ఆంధ్ర పేరుతో వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తుందన్నారు. అనంతరం స్థానిక స్వామి వివేకానంద యోగా ఆశ్రమం నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ నాయకులు అధికారులు సచివాలయాల సిబ్బందితో యోగాసనాలు వేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎస్.భీమరాజు, ఎస్.ఉషారాణి, బిళ్లకుర్రు సర్పంచ్ ఎన.లక్ష్మీపతిరావు, ఎంఈఓ ఎం.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలి

సఖినేటిపల్లి: రైతులకు నష్టం కలిగించే భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కేవీవీ ప్రసాద్ అన్నారు. శనివారం అంతర్వేదికరలో రాజోలు నియోజకవర్గ రైతు సంఘం సమావేశం జరిగింది. దేవ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన పై సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం వలన రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఈ హక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంల రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు దుర్గాదేవి అమ్మవారి తీర్థం

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో దుర్గాదేవి అమ్మవారి తీర్థోత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ క్యూ ఏర్పాటు చేసి చలువ పందిళ్లను నిర్మించారు. ఆలయ ప్రాంగణానికి చేపట్టిన విద్యుద్దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

స్వామి సన్నిధిలో అధ్యయన ఉత్సవాలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో శనివారం ఐదు రోజులు పాటు అర్చకులు నిర్వహించనున్న అధ్యయన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం వరకూ నిర్వహించే ఈ ఉత్సవాల్లో స్వామివారి సన్నిధిలో ఆయనను నిత్యం కొలిచిన భక్తులైన ఆళ్వార్లను కొలువుదీర్చి వీటి నిర్వహణకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, అర్చకుడు సుదర్శనం రమేష్ శ్రీకారం చుట్టారు. ఆలయ ఏసీ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.